◆కథానిక



# అంతర్లీనం

* ఆ తాతయ్య చక్కని చంద్రుడు, ఆ అమ్మమ్మ చిక్కని వెన్నెల. మానవ సంబంధాల్లో అంతర్లీనంగా వుండేది మాధుర్యమే కదా!

అమ్మ.

"పరమాణువులాంటి పరిమాణాన్ని అణువులుగా కూర్చి, కణాలుగా పేర్చి, శరీరాన్ని చీల్చి శిశువు రూపంలో ప్రపంచానికి అందించేది అమ్మ. మన మంటూ ఒకరున్నామని లోకానికి తెలియజేసుకునే అవకాశం ఇచ్చిన అమ్మకి కోటి దండాలు.

అమ్మ ఋణం తీర్చుకోవాలంటే అమ్మకి అమ్మై పుట్టక్కర్లేదు. ఆజన్మాంతం కృతజ్ఞతగా వుంటే చాలదూ..." అనేది మా అమ్మ.

అమ్మ కబుర్లలో ఎప్పుడూ అమ్మమ్మ గురించే చెప్పేది. తాతయ్య బోళాతనం, అమ్మమ్మ గడుసుతనం, కటువుగా మాట్లాడినా ఆ మాటల్లో అంతర్లీనంగా ప్రవహించే ప్రేమ గురించి, వాటిల్లో నిజాన్ని గురించి వివరించేది అమ్మ.

చిన్న పిన్ని పెళ్ళైయ్యాక, అలసిపోయి అందరూ నిద్రపోయారట. తెల్లవారుఝామున అమ్మకెందుకో మెలకువ వచ్చి చూస్తే అమ్మమ్మ, తాతయ్య కబుర్లు చెప్పుకుంటున్నారట.

"ఏమండీ పిల్లలందరి పెళ్ళిళ్ళు చేసేశాం. ఇంక మన బాధ్యత తీరిపోయింది. పిల్లలకి మన అవసరం తీరిపోయింది. ఆ పైవాడి పిలుపు కోసం ఎదురుచూడాలంతే" అని అమ్మమ్మ అంటుంటే...

"కాంతం ఇద్దరూ ఒకేసారి చచ్చిపోవడం కుదరదా" అని తాతయ్య బేలగా అనేసరికి, వింటున్న అమ్మకి మనసంతా కదిలిపోయి దగ్గరకెళ్ళి అమ్మమ్మని పట్టుకుని ఏడ్చేసిందట.

"ఎందుకే రాజ్యం ఏడుస్తావు. ఎప్పటికైనా తప్పదుగా. కాకపోతే ఒకటే కోరిక. నాకంటే ఆయనే ముందు పోవాలి. పునిస్త్రీగా చస్తే పునర్జన్మ వుంటుందో, వుండదో తెలీదు కాని నేను లేకుండా మీ నాన్న ఒక్క క్షణం బతకలేరు. నేనంటావా మొండిదాన్ని, పైగా ఆడదాన్ని ఎలాగైనా బతికేయగలను" అందట అమ్మమ్మ.

నిజమైన ప్రేమంటే అది కదా! తాతయ్య ఆధారపడే మనస్సుని ఎంత బాగా అర్థం చేసుకుంది. అమ్మమ్మ కోరిక ఏ దేముడు విన్నాడో మరి ముందుగా తాతయ్యనే తీసుకెళ్ళిపోయాడు.

* * *

ఫోన్ రాగానే నేనూ, అమ్మ, నాన్నగారు బయలుదేరి వచ్చాం. అప్పటికే పిన్నిలు, మామయ్యలూ వచ్చేసి వున్నారు. పది రోజులుగా మృత్యువుతో పోరాడిన తాతయ్యకి దగ్గరుండి సేవలు చేసింది అమ్మమ్మ. మనస్సును ఎంత సంసిద్ధం చేసుకున్నా పోయిన మనిషి కోసం ఏడవడం సహజం.

ముఖ్యంగా వాళ్ళిద్దరి దాంపత్యం గురించి అమ్మ ద్వారా కథలుగా విని అమ్మమ్మ దుఃఖాన్ని ఊహిస్తూ వచ్చిన నాకు, తాతయ్యని సాగనం పేటప్పుడు కూడా నిశ్చలంగా వున్న అమ్మమ్మని చూస్తే ఆశ్చర్యమేసింది.

ఓ రాత్రివేళ నాకు మెలకువ వచ్చి చూస్తే అమ్మమ్మ ఆకాశంవైపు చూస్తోంది. భయంగా దగ్గరకెళ్ళి "అమ్మమ్మా" అన్నాను. నావైపు తిరిగింది.

హమ్మయ్య అనుకుని పక్కన పడుకున్నాను.

"మీ తాతయ్య పిలుస్తున్నారే అదిగో చూడు" ఆకాశంవైపు చూపిస్తూ అంది.

"అలా మాట్లాడకమ్మమ్మా. భయమేస్తోంది" అన్నాను. నిజంగా భయమేసింది.

"తాతయ్య లేకుండా ఎలా బతకాలే అమ్మలూ. ఎందుకు బతకాలసలు"

# - పంతం సుజాత

ఆ కంఠంలో దుఃఖమో, దైన్యమో నాకర్థం కాలేదు. కాని ఆ గుండెల్లో వేదన గ్రహించి నా గొంతు పూడుకుపోయింది.

"మేము లేమూ. మాకోసం బతుకు అమ్మమ్మా. మాతోపాటు వచ్చేయి. లేదా కూతురింటికి రావడం ఇష్టం లేకపోతే మామయ్యవాళ్ళతో వెళ్ళిపో" అన్నాను.

ప్రేమగా తలమీద చెయ్యేసి నిమురుతూ "పడుకో" అంది.

అమ్మమ్మని గట్టిగా పట్టుకుని కళ్ళు మూసుకున్నాను.

* * *

పదకొండు రోజులయ్యాక అందరూ ప్రయాణమయ్యారు. పోయిన తాతయ్యకోసం మళ్ళీ ఓసారి గొల్లుమన్నారు. అప్పుడు కూడా అమ్మమ్మ కళ్ళు పొడిగానే వున్నాయి. పిన్నిలిద్దరూ వెళ్ళిపోయారు. మామయ్యలిద్దరూ తమతో రమ్మని అమ్మమ్మని చాలా సేపు బతిమాలారు.

"నేను రాను. ఇక్కడ బోల్డు వ్యవసాయం వుంది. మీరే ఇక్కడికి వచ్చేయండి. అందరం కలిసే వుందాం" నిశ్చితంగా చెప్పేసింది అమ్మమ్మ.

"ఎలాగమ్మా. పిల్లల స్కూళ్ళు, మా ఆఫీసులు మధ్యలో వదిలేసి వచ్చేయడం ఎలా కుదురుతుంది చెప్పు" నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు పెద్దమామయ్య.

"అదీకాక అక్కడ స్థిరపడినవాళ్ళు ఇక్కడికి వచ్చి అలవాటులేని వ్యవసాయం చేస్తూ కొత్తగా జీవితాన్ని మొదలుపెట్టడం ఎంత కష్టం. నువ్వే ఆలోచించు. కేవలం నీ ఒక్కదానికోసం" చిన్నమామయ్య ఆవేశపడిపోయాడు.

"అలాంటప్పుడు నా గురించి ఆలోచించకుండా మీ దారిన మీరు వెళ్ళండి" చెప్పి లోపలికి వెళ్ళిపోయింది అమ్మమ్మ.

మామయ్యలిద్దరూ నిజంగా చాలా బాధగా వెళ్ళారు.

నేను కాలేజీకి సెలవులు కావడంతో తర్వాత వస్తానని చెప్పడంతో అమ్మ వెళ్ళిపోయింది.

"నువ్వు మాత్రం ఎందుకే నాలుగు రోజుల మురిపెం. వెళ్ళిపోలేకపోయావా" అంది నన్ను చూసి.

"నేనో మాట చెప్పనా అమ్మమ్మా" అన్నాను.

ఏమిటన్నట్టు చూసింది.

"మామయ్యవాళ్ళు అన్నదాంట్లో తప్పేం వుంది. నిన్ను బాధపెట్టడం వాళ్ళ ఉద్దేశం కాదు కదా! ఎవరి దారి వాళ్ళది. ఆ శివయ్య తాత కొడుకులాగ పల్లెలలో ఆస్తి అంతా అమ్మేసి వాళ్ళు ఫారిన్ వెళ్ళిపోయి నిన్ను ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేర్పిస్తామనలేదే. కూడా తీసుకెళ్తామంటున్నారు. నీకు నచ్చితే వాళ్ళతో వెళ్ళు. లేదా ఇక్కడే హాయిగా వుండు. అంతేకాని..." అని ఓ క్షణం అమ్మమ్మ మొహంలోకి చూసి కొనసాగించాను.

"వాళ్ళు కన్నతల్లిని కష్టపెడుతున్నాం అనుకునేలా నువ్వెందుకు ప్రవర్తించాలి. ఎలాగూ వెళ్ళనప్పుడు ఇక్కడ నువ్వు హాయిగా వున్న భావం కలిగితే కనీసం వాళ్ళైనా తృప్తిగా వుంటారు కదా" అన్నాను.

అమ్మమ్మ జీవం లేని నవ్వొకటి నవ్వి "నువ్వూ ఈ తరం పిల్లవే కదా! ఇలా కాకపోతే ఎలా మాట్లాడతావు" అంది.

ఏదో చెప్పబోయాను.

"నన్ను విసిగించక వెళ్ళు" అని ముఖం తిప్పుకుంది.

నేను వెళ్ళబోతూ గుమ్మం దగ్గర ఆగి "రెండు తరాల మధ్య ఏర్పడిన ఖాళీని నీ అవగాహనతో పూరించలేవా అమ్మమ్మా... ఆలోచించు" అనేసి వచ్చేశాను.

* * *

ఏం చెయ్యాలో తోచక తిరుగుతుంటే ఓ గదిలో బీరువా నిండా పుస్తకాలు కనిపించాయి. చిన్నమా

(మిగతా 86వ పేజీలో)



(21వ పేజీ తరువాయి)

మయ్య చదువుకునేటప్పటివి కాబోలు. అవన్నీ తీసి చూస్తుంటే వాటి వెనకాల పాత టేప్ రికార్డర్, ఓ కేసెట్ బయటపడ్డాయి.

వాటిని చూడగానే నా చిన్నప్పటి సంఘటన గుర్తొచ్చింది. టేప్ రికార్డర్ వచ్చిన కొత్త రోజులవి. చిన్న మామయ్య ఓ టేప్ రికార్డర్ కొనుక్కొచ్చి, తాతయ్య పొలేరుమీద వేసిన కేకలూ, పిన్నిలిద్దరి పోట్లాటలు, చాటుగా రికార్డ్‌చేసి వినిపించేసరికి అందరూ ఒకటే నవ్వులు. నాకైతే ఆ పెట్టెలో చిన్న చిన్న మనుషులుంటారని... లాంటి ఆశ్చర్యం.

టేప్ రికార్డర్ దుమ్ము దులిపి ఆన్ చేశాను. తాతయ్య గొంతు 'గర్..గర్'మని.

అమ్మమ్మ కోసం వెతికితే పెరట్లో పడుకునుంది వెన్నెట్లో.

"అమ్మమ్మా" పిలిచాను.

"ఊ" అంది. ఇంకా కోపం తగ్గినట్టు లేదు. పక్కలో కూర్చుని టేప్ ఆన్ చేశాను. తాతయ్య గొంతు ఖంగుమంది.

"ఒరేయ్ మరిడయ్యా... ఆ గట్టె మేటెనకాల నిలబడి సుట్ట కాలుత్తున్నావా.. మేటు తగలబడి పోద్ది. బయటికి రారా ఎదవ...."

నేను అమ్మమ్మ వైపే చూస్తున్నాను. ఆ మాటలు వినిపిస్తున్న వస్తువుని చూస్తే ఏ జ్ఞాపకం గుండె తట్టిందో కళ్ళల్లో ఒక్కసారిగా మెరుపు.

"నా బంగారు తల్లి. నాకు అమ్మలా వచ్చి దారి చూపెట్టావు. తాతయ్య లేకుండా, బిడ్డలూ దగ్గర లేకుండా ఎందుకు బతకాలో తెలీక కొట్టుకుంటున్న నాకు 'ఎలా' బతకాలో నేర్పావు. చాలు తల్లీ చాలు" అంటూ నన్ను ముద్దుపెట్టుకుని ఏడ్చేసింది.

ఆ స్థితేమిటో తెలీకపోయినా నాకు దుఃఖం వచ్చింది. కాని బాధగా మాత్రం లేదు. నేనాశించిన మార్పు అమ్మమ్మలో వచ్చింది.

"అమ్మమ్మా నీ కోపం తగ్గితే పలకరిద్దామని ఇందాకట్నుంచి ఆ కొబ్బరాకుల్లోంచి ఎలా తొంగి చూస్తున్నాడో చూడు తాతయ్య" చంద్రుణ్ణి చూపిస్తూ అన్నాను.

"నాకే చందమామ కథలు చెబుతావటే" అంటూ నవ్వేసింది.

మనసు తేలికపడ్డప్పుడు వచ్చే నవ్వుని గుర్తించడం పెద్ద కష్టమేమీ కాదు.

నేను వచ్చేస్తుంటే నవ్వుతూ సాగనంపిన అమ్మమ్మని చూసి తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను.

ఇంక ఫరవాలేదు. తాతయ్య స్నానం చేసే ముక్కాలి పీటనుంచి, చేతి కర్ర వరకూ, పడక్కుర్చీ నుంచి పందిరి మంచం వరకు అందరూ అమ్మమ్మకి స్నేహితులే. బోల్డు కాలక్షేపం అమ్మమ్మకి, మనం బెంగపడక్కర్లేదు అనుకుని బస్సెక్కాను.

